రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.17, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.36, గోకరకాయ రూ.45, దోసకాయ రూ.25, సొరకాయ రూ09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.45, మునగ రూ.55, కందగడ్డ రూ.65, బీట్‌రూట్ రూ.17, కీర రూ.23, బీన్స్ రూ.35, క్యాప్సికమ్ రూ.32. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

కొత్త కార్డులకు కార్యాలయానికి పరుగులు

చాదర్‌ఘాట్: మార్చి ఒకటవ తేదీ నుంచి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలలోని వారికి కొత్త రేషన్ కార్డులు కోసందరఖాస్తు చేసుకున్న వారికి రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించడంతో మలక్‌పేట సర్కిల్–1 సివిల్ సప్లయ్ కార్యాలయానికి దరఖాస్తుదారులు పోటెత్తారు. మలక్‌పేట సర్కిల్–1 సివిల్ సప్లయ్ కార్యాలయంలో ఫిబ్రవరి 28 వరకు 11 వేల దరఖాస్తులు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వచ్చాయని అదే విధంగా 6 వేల దరఖాస్తులు పేర్ల తొలగింపు, 3800 దరఖాస్తులు నమోదుకు వచ్చాయన్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా కొత్త రేషన్ కార్డులు మార్చి ఒకటవ తేదీన ఇస్తారని పలువురు దరఖాస్తుదారులు ఆయా కార్యాలయాలకు పరుగులు తీశారు. ఈ విషయంపై సంబంధిత సర్కిల్–1 అధికారి (ఏఎస్ఓ) వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదన్నారు.

టాక్ టైల్స్ ఏర్పాటు



చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ భవనంలో బ్లైండ్స్ సౌకర్యార్థం టాక్ టైల్స్ ఏర్పాటు చేసినట్లు డైరెక్టర్ శైలజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దాదాపు రూ.5లక్షలతో ఈ టాక్ టైల్స్ ఏర్పాటు చేశామని బ్లైండ్స్ కార్యాలయంలోకి రాగానే ఎవరి సహాయం లేకుండా టాక్ టైల్స్ ద్వారా అధికారి కార్యాలయంలోకి చేరుకుంటారన్నారు.

రోడ్లను శుభ్రంగా ఉంచాలి



సిబ్బందితో మాట్లాడుతున్న మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీల్లోని రోడ్లను శుభ్రంగా ఉంచాలని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సూచించారు. మార్నింగ్‌వాక్‌లో భాగంగా ఆదివారం ఆయన డివిజన్లలోని పలు కాలనీలలో పర్యటించారు. కాలనీలో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ జవాన్ యాదయ్య, బాలకృష్ణ, పురుషోత్తం, రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం యోగా చేయాలి

హస్తినాపురం: భారతీయ యోగా సాంస్థాన్ ఆధ్వర్యంలో విశ్వేశ్వర ఇంజనీర్స్ కాలనీ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యోగా శిక్షకులు కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిత్యం యోగా చేస్తే శరీరంతో పాటు మనస్సును అదుపులో ఉంచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి, వెంకటేశ్వర్లు గౌడ్, యాదగిరి, ప్రభాకర్, వాణి, మోహన్, వెంకట్‌నారాయణ, సత్తయ్యగౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, అమరనాథ్ యాదవ్, ఐలేష్‌గౌడ్ పాల్గొన్నారు.

పనులు ట్రాక్ తప్పాయ్!



- నాలుగేళ్లుగా కొనసాగుతున్న వైనం
- పూర్తి చేయాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు

చైతన్యపురి: మినీ ట్యాంక్ బండ్‌గా పేరొందిన సరూర్‌నగర్ చెరువు చుట్టూ నిర్మాణం జరుగుతున్న వాకింగ్ ట్రాక్ పనులు నాలుగేళ్లుగా కొనసాగుతూనే ఉన్నాయి. మిషన్ కాకతీయ ఫేజ్–4లో భాగంగా రూ 9.5 కోట్ల వ్యయంతో 2020 జూన్‌లో ప్రారంభం అయ్యాయి. మినీట్యాంక్ బండ్‌కు వాకింగ్ ట్రాక్ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారుతుందని అందరూ భావించారు. మినీట్యాంక్ బండ్ వద్ద ఇప్పటికే ఇందిరా ప్రియదర్శిని పార్కు అందుబాటులో ఉంది. వాకింగ్ ట్రాక్ పూర్తియితే చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ కోసం మట్టి పోసి కట్ట తయారు చేశారు తప్ప మిగిలిన పనులు మాత్రం ముందుకు సాగలేదు.

ఎక్కడి పనులు అక్కడే..

అధికారులు గతంలో ప్రకటించిన ప్రకారం 2021 జూన్‌లోగా పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ ఎక్కడ గొంగళి అక్కడే అన్నట్లు వాకింగ్ ట్రాక్ పనులు ఉన్నాయి. గోద్రేజ్ హోం నుంచి తపోవన్ కాలనీ వరకు 6.5 మీటర్ల వెడల్పుతో సుమారు రెండు కిలో మీటర్ల వరకు ట్రాక్ పనులు చేపట్టారు. ట్రాక్ ఇరువైపులా ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయాల్సి ఉంది. అంతేకాక ట్రాక్‌కు అడ్డుగా ఉన్న నిర్మాణాలు అలాగే వున్నాయి. సరూర్‌నగర్ చెరువులోకి వివిధ కాలనీల నుంచి వచ్చే వరదనీరు మళ్లించేందుకు స్ట్రామ్ నాలా డెవలప్‌మెంట ప్రోగ్రాం కింద వాకింగ్ ట్రాక్ నిర్మాణంలో అవసరమైన ప్రాంతాల్లో చాంబర్లు ఏర్పాటు చేసి ట్రాంక్‌లైన్ ద్వారా నీటిని శంకేశ్వరబజార్‌వైపు నాలాలో కలపాల్సి ఉంది. ఆ పనులు పూర్తయిన తర్వాత వాకింగ్ ట్రాక్ నిర్మాణం పనులను మార్చి 2022 వరకు పూర్తి చేస్తామని అప్పటి అధికారులు హామీలిచ్చినా పనులు మాత్రం ముందుకు సాగలేదు.

ప్రజాధనం వృథా..

నాలుగేళ్ల క్రితం పారంభించిన వాకింగ్ ట్రాక్ పనులు ఆలస్యం కావటం వల్ల ప్రజాధనం దురినియోగం అవుతుంది. వేసిన కట్ట కూడా గుంతలుగా పడి అధ్వానంగా మారింది. అంతేకాక సమీప కాలనీల ప్రజలు ఇక్కడే వేస్తుండటంతో ట్రాక్ అందవిహీనంగా మారింది. ఇప్పటికై నా ప్రభుత్వం వాకింగ్ ట్రాక్ త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

కాంట్రాక్టర్ వల్లే ఆలస్యం

వాకింగ్ ట్రాక్ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వేరే వ్యక్తికి సబ్ కాంట్రాక్ట్ ఇవ్వగా మధ్యలోనే వదిలి వెళ్లి పోవడంతో ఆలస్యమైన మాట వాస్తవమే. వేరే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి చేయించాలని నిర్ణయించాం. వచ్చేవారం పనులు ప్రారంభం అవుతాయి. త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తాం.

–టి.సతీష్,
ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

హమాలీలకు లైసెన్స్ అందజేత



లైసెన్స్ అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: గత 20 ఏళ్లుగా మార్కెట్‌లో పనిచేసే హమాలీలకు గుర్తింపు లైసెన్స్ లేవని మా పాలకవర్గం ఏర్పాటు తర్వాత అటు బాటసింగారం పండ్ల మార్కెట్, ఇటు ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్‌లోని హమాలీలకు గుర్తింపు లైసెన్సుతో పాటు ప్రమాద బీమా, రెండు జతల దుస్తులు అందజేస్తున్నామని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆర్‌కే పురం డివిజన్‌లోని ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్‌లో పనిచేసే 75 మంది హమాలీలకు గుర్తింపు లైసెన్సులను అందజేశారు. ఈ సందర్భంగా చిలుక మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరంతరం శ్రమించే హమాలీలను కుటుంబ సభ్యులుగా పరిగణిస్తాం వారికి రావాల్సిన ప్రయోజనాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కరాచారి, ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎల్ శ్రీనివాస్, వహీద్ తోపాటు పాలకవర్గ సభ్యులు బండి మధుసూదన్ రావు, పన్యాల జైపాల్ రెడ్డి, నవరాజ్, బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, మెగావత్ గణేష్ నాయక్, చెన్‌రెడ్డి రఘుపతి రెడ్డి, మేకం లక్ష్మి, దోమలపల్లి అంజయ్య, నరసింహ, ఇబ్రహీం, సిఐటియు నాయకులు వీరయ్య, చంద్రమోహన్ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: దీర్ఘకాలికంగా ఉన్న సమస్యను పరిష్కరిస్తే సమీప కాలనీలవాసులు ప్రేమతో రోడ్డుకు నా పేరు పెట్టుకుంటే తప్పేంటని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ప్రశ్నించారు. హయత్‌నగర్ పరిధిలోని శివం హిల్స్ నుంచి కుంట్లూరుకు వెళ్లే ప్రధాన రహదారి పనులను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇటీవల జరిగిన జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో బీజేపీ కార్పొరేటర్లు చేపట్టిన ఆందోళన, నిరసన కార్యక్రమాలతో కార్పొరేటర్లకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కార్పొరేటర్ల డిమాండ్లను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించారన్నారు. కార్పొరేటర్ల డిమాండ్లను అనుకూలంగా అధికారులు పనిచేస్తే బెదిరింపులకు పాల్పడి ట్రాన్స్‌ఫర్లు, సస్పెన్షన్లు చేపట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాలనీలవాసులు మాధవరెడ్డి, ప్రమోద్ రెడ్డి, లక్ష్మారెడ్డి, హరిప్రసాద్, శ్యాంసుందర్‌రెడ్డి, దామోదర్, భాస్కర్, నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణాగౌడ్, రాజేశ్వరీ పాల్గొన్నారు.

దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తా



ఐఎస్‌సదన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్

సైదాబాద్: యాకత్‌పురా నియోజకవర్గ పరిధిలోని ఇతర డివిజన్ల కన్నా ఐఎస్‌సదన్ డివిజన్ నుంచి ప్రజలు అత్యధికంగా పన్నులు చెల్లిస్తున్నా ఇక్కడ ఆ స్థాయిలో అభివృద్ధి జరగడం లేదని ఈ విషయమై ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి కోరారు. యాకత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌తో కలిసి ఆదివారం ఆమె పూర్ణోదయాకాలనీ, లక్ష్మీనగర్ కాలనీల్లో పర్యటించారు. అనంతరం లక్ష్మీనగర్ కాలనీ పార్కులో ఎమ్మెల్యే, కార్పొరేటర్, కాలనీవాసులతో సమావేశమయ్యారు. నాలా పనులు, అంతర్గత రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీలు, పార్కుల నిర్వహణ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా దశలవారీగా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట డీసీ మంగతాయారు, ఇంజినీరింగ్ ఈఈ ఏకాంబరం, ఏఈ శిరీష, జంగం మధుకర్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా జక్కిడి జన్మదిన వేడుకలు





తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి జన్మదిన వేడుకలు మన్సూరాబాద్ సెంట్రల్‌బ్యాంక్‌కాలనీలోని ఆయన నివాసంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరై జక్కిడి శివచరణ్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. –మన్సూరాబాద్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం లింగోజిగూడ డివిజన్ పరిధిలోని శాతవాహన కాలనీలో రూ.58 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులకు ఆయన కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని మరింతా అభివృద్ధి చేస్తానన్నారు. గతంలో చిన్నపాటి వర్షానికి కాలనీలు జలమయం అయ్యేవి. నూతన డ్రైన్స్ వ్యవస్థ ఏర్పాటు చేసి ముంపు సమస్యల నుంచి విముక్తి కలిగించామన్నారు. ఈ కార్యక్రమంలో తిలక్ రావు, శ్రీధర్‌గౌడ్, మధుసాగర్, ప్రవీణ్‌రెడ్డి, పల్సం శ్రీధర్, జూపల్లి ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



మలక్‌పేట: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని జీఎస్ఐ జియో శాస్త్రవేత్త అర్పిత అన్నారు. మూసారంబాగ్ బ్రాంచ్‌లో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాల్లో తగిన ప్రోత్సహం అందిస్తే మరింతగా రాణిస్తారన్నారు. టెక్నాలజీతో ముడిపడి ఉన్న నేటి ప్రపంచంలో కొత్త ఆలోచనలు, మెళకువలతో కూడిన బోధన అవసరమన్నారు. విద్యార్థుల నమూనాలను తిలకించి అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం సతీష్, ఆర్ఐ వెంకట్ రెడ్డి, ప్రిన్సిపాల్ రిజ్వానా పాల్గొన్నారు.

పదిమంది ట్రాన్స్‌జెండర్స్ అరెస్ట్

చైతన్యపురి: రాత్రివేళల్లో రోడ్లపై తిరుగుతూ కాలనీవాసులకు ఇబ్బందులు కలిగిస్తున్న పలువురు ట్రాన్స్ జెండర్స్‌ను సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పీఅండ్‌టీ కాలనీలో కల్లు కాంపౌండ్ సమీపంలో ఉంటూ ట్రాన్స్‌జెండర్స్ రాకపోకలు సాగించే వారిపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఇబ్బందులు కలిగిస్తున్నారని కాలనీవాసులు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్ఓటీ పోలీసులు, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పది మందిని అదుపులోకి తీసుకుని సరూర్‌నగర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు.

విజ్ఞాన విహార యాత్రకు జైపురికాలనీ విద్యార్థులు

నాగోలు: విద్యార్థులకు చదువుతో పాటు చారిత్రక ప్రదేశాలకు తీసుకెళ్లడంతో వివిధ అంశాలపై అవగాహన వస్తోందని నాగోలు జైపురికాలనీ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పాఠశాల విద్యార్థులను విజ్ఞాన విహార యాత్రలో భాగంగా సాలార్‌జంగ్ మ్యూజియం, తెలంగాణ సచివాలయం, అంబేడ్కర్ విగ్రహం, నెక్లెస్ రోడ్డు, బుద్ధవిగ్రహం, ఎన్టీఆర్ గార్డెన్స్, ఎన్టీఆర్‌ఘాట్, బిర్లా మందిర్ లాంటి స్థలాలకు తీసుకెళ్లారు. ఈ యాత్రకు బస్సును సమకూర్చిన కార్పొరేటర్ చింతల అరుణకు ధన్యవాదములు తెలిపారు. ఉపాధ్యాయులు అనంత రెడ్డి, మల్లేష్, రమాదేవి, సుధారాణి, భరత్ విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ సురపల్లి నందా

నాగోలు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జస్టిస్ సురపల్లి నందా అన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) తెలంగాణ శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో నాగోలు పీబీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో జస్టిస్ సురపల్లి నందా పాల్గొని మాట్లాడారు. దేశంలోని మహిళలు ఓటింగ్‌లో పాల్గొంటారని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ దిగువస్థాయిలలో పురుషుల కన్నా ఎక్కువ పోటీ చేస్తున్నారన్నారు. రాజకీయాల్లో లింగ అసమానతలను రూపుమాపడానికి భారత ప్రభుత్వం స్థానిక ప్రభుత్వ స్థానాలలో మహిళల కోసం రాజకీయ రిజర్వేషన్లు ఏర్పాటు చేసిందన్నారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. నేడు మహిళలు పురుషులకు సమానంగా రాణిస్తున్నారన్నారు. వైశ్య ఫెడరేషన్ న్యూఢిల్లీ ప్రెసిడెంట్ అశోక్ అగర్వాల్ మాట్లాడుతూ.. మహిళలు రాజకీయ రంగాల్లో రాణిస్తున్నారని, ఉదాహరణకు న్యూఢిల్లీ శాఖ కన్వీనర్‌గా ఉన్న గీతాగుప్తా ఢిల్లీ ముఖ్యమంత్రి అవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ న్యూఢిల్లీ సలహా కమిటీ చైర్మన్‌గంజి రాజమౌళి గుప్తా, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్, తెలంగాణ ఐవీఎఫ్ చీఫ్ అడ్వైజర్ ముత్యాల సత్తయ్య, సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ కక్కిరాల రమేష్, నాయకులు గట్టు మహేష్, జి.చంద్రయ్య, మహిళా చైర్ పర్సన్ ఉప్పల స్వప్న, అధ్యక్షురాలు చందా భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి



దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని టీపీసీసీ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో ఐరిస్ ఫ్లోరెట్స్ స్కూల్ నిర్వహించిన వార్షికోత్సవంలో దేప భాస్కర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. పిల్లలు సెల్‌ఫోన్ ప్రపంచంలో మునిగిపోకుండా ఉండాలంటే తల్లిదండ్రులు కూడా ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఇంట్లో పేదరికం పోవాలన్నా.. సమాజంలో మంచి గుర్తింపు రావాలన్నా విద్యావంతులుగా ఉండాలన్నారు. సమ సమాజ స్థాపన సైతం చదువుతోనే సాధ్యమని మంచి చదువుంటే మంచిజ్ఞానం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐరిస్ ఫ్లోరెట్స్ స్కూల్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉపేందర్ రెడ్డి, రామకృష్ణపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు,సురేష్, లింగా స్వామీ గౌడ్, నగేష్, విప్లవ రెడ్డి పాల్గొన్నారు.

భయం వీడితే పదిలో బోలెడు మార్కులు



విద్యార్థులకు జ్ఞాపికలను అందజేస్తున్న కృష్ణారెడ్డి

చంపాపేట: భయం వీడి ఆత్మస్థైర్యంతో పరీక్షకు హాజరైతే పదిలో బోలెడు మార్కులు సాధించవచ్చని విద్యావేత్త, విశ్రాంత ఉపాధ్యాయుడు లెక్కల కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు, ఓరియేంటేషన్ తరగతుల కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలన్నారు. రాత్రి తొందరగా నిద్రపోయి వేకువజామున లేచి ముఖ్యమైన పాఠ్యాంశాలను రివిజన్ చేయాలని సూచించారు. రసాయన, భౌతిక శాస్త్రాలకు సంబధించిన నిర్వచనాలు, భేదాలు, పోలికలు, సిద్ధాతాలను క్షుణ్ణంగా అభ్యసనం చేస్తే ఆయా సబ్జెక్టలలో నూరు శాతం మార్కులు సాధించవచ్చని సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ లలితా రెడ్డి, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు నర్సింహా, శివకుమార్, వినయ్ కుమార్, బీనా, మాధవి, ఆవీనా, రజిత, గీతాంజలి, కళావతి, మంజుల పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

చాదర్‌ఘాట్: భార్య విడాకులు ఇవ్వడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్సై రవీంద్ర వివరాల ప్రకారం అక్బర్‌బాగ్ డివిజన్ ఆనంద్ నగర్‌కు చెందిన సందీప్ (40) సాఫ్ట్‌వేర్. దంపతుల నడుమ గొడవలు తలెత్తడంతో భార్య విడాకులు ఇవ్వగా వేర్వేరుగా ఉంటున్నారు. మనస్తాపానికి గురైన సందీప్ ఆదివారం ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వైద్య వృత్తి ఎంతో గొప్పది



వైద్యుడిని సన్మానిస్తున్న గడ్డం ప్రసాద్

దిల్‌సుఖ్‌నగర్: వైద్య వృత్తి ఎంతో గొప్పదని ప్రకృతి వైద్యం నుంచి రోబోటిక్స్ వైద్యం వరకు అధునాతన వైద్యం అభివృద్ధి చెందుతుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. కొత్తపేటలో శనివారం రాత్రి నిర్వహించిన ఓజోన్ హాస్పిటల్ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్య వృత్తిని మానవతా కోణంలో చూస్తున్న ఓజోన్ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. కోవిడ్ సమయంలో వారు చేసిన సేవలు మరువలేనివన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంతో విద్యా, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. హాస్పిటల్ చైర్మన్ సత్యసాయి ప్రసాద్, ఎండీ దీప్తి మాట్లాడుతూ.. హాస్పిటల్ నెలకొల్పి లాభాల పేక్షతో కాకుండా సమాజానికి తమ వంతు సహాయంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. సీఈఓ శ్రీనివాస్‌రావు, ఎండీ మధుసూదర్‌రెడ్డి, డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రీడింగ్ రూమ్ ప్రారంభం



రీడింగ్ రూమ్ ప్రారంభోత్సవంలో మల్‌రెడ్డి రాంరెడ్డి

నాగోలు: గ్రంథాలయాలు సామాజిక ఆవశ్యకత మాత్రమే కాకుండా, అన్ని వయస్సుల వారికి విజ్ఞానాన్ని పెంపొందించే వేదికలుగా నిలుస్తాయని రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఆదివారం నాగోలు డివిజన్‌లోని శ్రీ సాయినగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయ రీడింగ్ రూమ్‌ను నాగోలు కార్పొరేటర్ చింతల అరుణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీనియర్ సిటిజన్ల కోసం ఏర్పాటు చేసిన ఈ గ్రంథాలయం వారికి సమాజంతో మరింత మమేకమయ్యేలా చేస్తుందని, పుస్తక పఠన సంస్కృతిని ప్రోత్సహించడంలో ఈ తరహా గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. సాయినగర్‌లోని సమస్యలు తన దృష్టికి వచ్చాయని, వాటికి త్వరలోనే పరిష్కార మార్గం చూపేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని హామీ ఇచ్చారు. మంజుల రెడ్డి, సురేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, గణేష్ నాయక్, దయానంద్ రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీనివాస చార్యులు, పాండురంగాచారి, నగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి..

నాగోలు: సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం రీడింగ్ రూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీసాయినగర్ సౌత్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నుంచి 30 మంది వచ్చి తనపై దాడి చేశారని వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీ సాయినగర్ కాలనీ చెందిన సీనియర్ సిటిజన్ ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీసాయినగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో గ్రంథాలయం నిర్వహిస్తున్నామని కొంతమంది దాతల సహాయంతో పైఅంతుస్తులో రీడింగ్ రూమ్ నిర్మాణం చేసినట్లు ఆయన తెలిపారు. ఆదివారం ప్రారంభోత్సవం ఏర్పాటు చేయడంతో ఈ విషయం తెలుసుకున్న శ్రీసాయినగర్ సౌంత్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, ఇతర సభ్యులు మా కార్యక్రమం దగ్గర వచ్చి వారే రిబ్బన్ కట్ చేశారన్నారు. తనకు శ్రీసాయినగర్ సౌంత్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి ఇతర సభ్యులతో ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలి ఫిర్యాదులో పేర్కొన్నాడు.